సాక్షి చిత్తూరు

గురువారం । 28 । డిసెంబర్ । 2023



జగన్‌తోనే బీసీలకు గుర్తింపు

జీసీలకు గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రమణ్యం అన్నారు. - 8లో



అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

ఇళ్లు, బ్యాంకుల్లో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పలమనేరు పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ట్యాబ్‌లిచ్చినా కడుపుమంటేనా?

పేద పిల్లలకు ప్రభుత్వం ట్యాబ్‌లిచ్చినా కొందరికి కడుపుమంట తప్పడం లేదని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

స్నేహభావంతో మెలగాలి



మొక్క నాటుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

పూతలపట్టు: సమస్యల పరిష్కారం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలిగి, వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా పూతలపట్టు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ సిబ్బంది నుంచి గౌరవ వందనం అందుకున్నారు. అనంతరం స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపులో ఉంచాలన్నారు. అక్రమ మద్యం, రవాణాపై దృష్టి పెట్టాలన్నారు. మండలం నలుమూల్లో సీసీ కెమెరాలు అమర్చి నిఘా ఉంచాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుమానం కలిగిన వ్యక్తుల కదలికలను గమనించాలన్నారు. రాత్రి వేళలో చోరీలు జరగకుండా పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసులు గ్రామాల్లో పల్లె నిద్ర చేపట్టాలని తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఎస్‌ఐ రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల పరిశీలన



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుది జాబితా ప్రచురణ తేదీ మార్పు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్


చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల తుది జాబితా ప్రచురణ తేదీని మార్పు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 5వ తేదీన తుది జాబితా ప్రచురణ జరగాల్సి ఉందని, అయితే ఈ ప్రక్రియను జనవరి 22వ తేదీకి మార్చుతూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం జనవరి 12వ తేదీ వరకు, డేటాబేస్ అప్‌లోడ్‌కు జనవరి 17వ తేదీ వరకు గడువు ఉందన్నారు. తుది ఓటర్ల జాబితా ప్ర చురణ జనవరి 22వ తేదీన జరుగుతుందన్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.78 కోట్లు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్,ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి హుండీ ద్వారా రూ.1.78 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 21 రోజులుగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను బుధవారం ఉదయం ఆస్థాన మండపంలో లెక్కించారు. ఇందులో 56 గ్రాముల బంగారం, 570 గ్రాముల వెండి, గో సంరక్షణ ట్రస్టు హుండీ ద్వారా రూ.11 వేలు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ 853 డాలర్లు, ఆస్ట్రేలియా 340 డాలర్లు, ఇంగ్లాండ్ 500 పౌండ్లు, యూఏఈ 5 దీరమ్స్, సింగపూర్ 100 డాలర్లు, మలేషియా 71 రింగిట్స్ మొత్తం రూ.1.78 కోట్లు రాబడి వచ్చినట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, పర్య వేక్షకుల కోదండపాణి,శ్రీధర్‌బాబుపాల్గొన్నారు.





పల్లెకు ఆరోగ్య అభయం

పల్లె ప్రజలకు పైసా ఖర్చు లేని మెరుగైన వైద్యం అందించడానికి వైఎస్సార్ సీపీ సర్కారు కృషి చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకుని, సిబ్బంది, మందులు, మాత్రలతోపాటు అన్ని రకాల ల్యాబ్ పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది. సామాన్య రోగి స్వస్థత పొంది సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా పల్లెకు ఆరోగ్య అభయం లభించింది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో అభివృద్ధి పరుగులు
- ఆరోగ్య సేవలు బహుబాగు
- 24 గంటలు పనిచేసేలా చర్యలు
- వైద్య సేవలపై ప్రజల హర్షం

చిత్తూరు నియోజకవర్గంలో పీహెచ్‌సీ వివరాలివీ

పీహెచ్‌సీల సంఖ్య	3
డాక్టర్లు	ఆరుగురు
సిబ్బంది	36 మంది
రోజువారీ ఓపీలు	450 (సుమారు)
కేంద్రంలో చేసే ల్యాబ్ పరీక్షల సంఖ్య	25
మందులు, మాత్రలు	140 రకాలు
ప్రసవాలు (ప్రతినెలా)	10

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వైద్యానికి పెద్ద పీట వేసింది. పల్లె ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చడానికి నడుం బిగించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. పల్లెలోని పేదలకు ఆయుష పోస్తోంది. సేవలు బహుబాగుగా అందిస్తోంది. దీంతో పేద ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో మూడు పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ఉన్నాయి. బీఎస్‌ఆర్‌పేట, గుడిపాల, బొమ్మసముద్రం ప్రాంతాల్లో కేంద్రాలు ఉండగా ప్రతిరోజూ 450 వరకు ఓపీలొస్తున్నాయి. ఈ పరిధిలోని పల్లె ప్రజలకు ప్రసుత్త రోజుల్లో పీహెచ్‌సీ వైద్యం అత్యవసరంగా మారింది. చిన్న జబ్బు చేసినా అక్కడికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.

నాడు ఇలా..

గత ప్రభుత్వంలో పీహెచ్‌సీలో వైద్యం ఆమడదూరంలో నిలిచింది. సూది, దూది, మందులు, మాత్రలు కరువు.. పరీక్షలు, వైద్యసిబ్బంది, సమయపాలన లేమి.. మధ్యాహ్నానికే ఆస్పత్రికి తాళం.. వెరసి పల్లె ప్రజలు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా మారాయి.

నేడు ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలోకి వచ్చాక వైద్యసేవలకు పెద్దపీట వేసింది. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా చేసుకుంది. పల్లె ప్రజలకు ఖరీదైన వైద్యాన్ని మరింత చేరువ చేసింది. తొలుత నాడు–నేడు కింద ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను మార్చింది. కావాల్సిన పరికరాలను సరఫరా చేసింది. తర్వాత అవసరమైన మేరకు సిబ్బంది భర్తీ చేసింది. ఫలితంగా ఉదయం 9 గంటలకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తలుపులు తెరుచుకుంటున్నాయి. పేషియల్ అటెండెన్స్‌ను తీసుకురావడంతో సమయపాలన గాడిలో పడింది. పీహెచ్‌సీ పరిధిలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు కేంద్రంలో, మరొక్కరు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరవుతున్నారు. 4 గంటల వరకు ఓపీ చూస్తున్నారు. ఇటీవల 24 గంటలు పనిచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేస్తున్నారు. 140 రకాల మందులు, మాత్రలు అందుబాటులో ఉన్నాయి. 25 రకాల ల్యాబ్ పరీక్షలు చేస్తున్నారు.



గుడిపాలలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మాలాంటి వారికి మేలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఆరోగ్య సేవలను మెరుగుపరిచారు. దీని వల్ల తాము ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్యం చేయించుకుంటున్నాం. గతంలో ఆరోగ్య కేంద్రాలకు వెళ్లే వాళ్లం కాదు. ఏ రోగానికైనా మందులు, మాత్రలు అడిగితే లక్కుమని చికిత్స చేసి, చేతిలో పెడుతున్నారు. నయం అయ్యేంత వరకు పర్యవేక్షిస్తున్నారు. బీపీ, షుగర్ ఇతర పరీక్షలు కూడా ఆరోగ్య కేంద్రాల్లోనే చేయడంతో మాలాంటి వారికి మేలు జరిగింది. ఇంత కంటే గొప్ప సేవ వేరొక్కటి ఉండదు.

–విశ్వనాథరెడ్డి, గుడిపాల

పట్టణానికి వెళ్లే బాధలు తప్పాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్యానికి ఢోకాలేదు. ఆరోగ్యం కేంద్రంలోనే చూపించుకుంటున్నాం. పిల్లలకు చికిత్స చేసేందుకు ప్రతి వారం కేటాయించిన రోజుల్లో ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నారు. పనిగట్టుకుని పట్టణానికి వెళ్లే బాధలు తప్పాయి. పీహెచ్‌సీలో సకల వైద్యసేవలు అందించడంతో ఆర్థిక ఇబ్బందులు లేవు. సమయమూ వృథా కాలేదు. పల్లెలోనే ఆరోగ్య సేవలు బాగున్నాయి. పక్క రాష్ట్రం తమిళనాడులో కూడా ఇలాంటి సేవలు లేవు.

–బాబు, గుడిపాల

వైద్యం బాగా చేస్తున్నారు



ఇప్పుడు ఆస్పత్రి 24 గంటలు పనిచేస్తోంది. కొద్దిపాటిగా ఆరోగ్యం దెబ్బతిన్నా వెంటనే ఆస్పత్రికి వచ్చి చూపించుకుంటాం. మందులు, మాత్రలు ఇస్తున్నారు. డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. మంచిగానే చికిత్స చేస్తున్నారు. ముందు ఇలా లేదు. మధ్యాహ్నానికే తలుపులు వేసే వారు. ఇప్పుడు 24 గంటలు తెరిచే ఉన్నాయి.

–ఆరుముగం, చిత్తూరు మండలం

పల్లెకు ఊపిరిపోశారు



గతంలో వైద్యమంటే ప్రైవేటు ఆస్పత్రులు గుర్తుకొచ్చేవి. చేతిలో డబ్బులు లేకపోయినా అప్పోసప్పో చేసి వైద్యానికి రూ.వేలు ఖర్చు చేసేవాళ్లం. ఇప్పుడు ఏఎన్‌ఎంలు ఇంటికొచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు, మాత్రలు ఇస్తున్నారు. పల్లె వైద్యానికి ఊరిపి పోసి, బతికిస్తున్నారు.

– వెంకటేష్, చిత్తూరు మండలం

ఖర్చులు తగ్గాయి



గతంలో చిన్న జబ్బు చేసినా ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్ఎంపీ డాక్టర్ల వద్దకు వెళ్లి చూపించుకునేవాళ్లం. అక్కడ రూ.వందలు ఫీజుల పేరుతో గుంజుకునే వారు. మందులు, మాత్రలు రాసి అందిన కాడికి దోచేసే వారు. జ్వరానికి కూడా అప్పట్లో రూ. 600పైనే ఖర్చు అయ్యేది. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. 24 గంటలు ఆస్పత్రి పనిచేయడంతో నేరుగా వెళ్లి చూపించుకుంటాం. రూపాయి ఖర్చు లేదు.

– నీలావతి, గుడిపాల

ఆస్పత్రి 24 గంటలు పని చేయడం మేలు



గతంలో పీహెచ్‌సీకి మధ్యాహ్నానికి తాళం వేసి వెళ్లిపోయేవాళ్లు. ఈ ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా డ్యూటీ టైం వరకు ఉంటున్నారు. ఎప్పుడెళ్లినా సిబ్బంది ఉంటున్నారు. 24 గంటలు పనిచేస్తున్నారు. దీంతో రాత్రివేళ్ల వైద్యం కష్టాలు తప్పాయి. జ్వరం మొచ్చిన వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి వైద్యం చేయించుకున్నాం. రూపాయి ఖర్చు లేదు.

– విజయ, గుడిపాల

క్రీడారంగానికి మహర్దశ



గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి ఆర్కే రోజా



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

- సౌత్‌జోన్ మహిళల వాలీబాల్ టోర్నీ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా
- క్రీడలతో బంగారు భవిత

తిరుపతి సిటీ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో క్రీడారంగానికి మహర్దశ పట్టిందని, విదార్థినులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. బుధవారం శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఐదురోజుల పాటు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఆరు రాష్ట్రాలకు చెందిన సుమారు 89 యూనివర్సిటీల నుంచి విచ్చేసి క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమన్నారు. స్పోర్ట్స్‌తో విదార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని వెల్లడించారు. ఉపాధి, ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువుల్లోనూ ప్రత్యేక కోటా ఉందని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థినులు తమ యూనివర్సిటీ పేరు ప్రతిష్టలను ఇనుమడించేలా ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. క్రీడాకారులకు మాత్రమే రాష్ట్రంతోపాటు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని వివరించారు. చదువుకే పరిమితం కాకుండా వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆడుదాం ఆంధ్ర క్రీడల పండుగ జరుగుతోందని వెల్లడించారు. మొత్తం 15వేల సచివాలయాల పరిధిలో గ్రామీణ. పట్టణ ప్రాంత యువతలోని ప్రతిభను వెలికితీయడమే ఆడుదాం ఆంధ్ర ఉద్దేశమని తెలిపారు. ఈ క్రమంలోనే పోటీల్లో పాల్గొంటున్న 91 జట్లను మంత్రి పరిచయం చేసుకుంటూ వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం క్రీడాకారులతో వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సారా సరోజిని, టీటీడీ స్పోర్ట్స్ ఆఫీసర్ భాస్కర్, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు వెండి తోరణం

- రూ.12 లక్షల విలువ చేసే ఆభరణం బహూకరణ
- దాతను సత్కరించిన చైర్మన్, ఈఓ



వెండి మకర తోరణాన్ని ఆలయ చైర్మన్, ఈఓకు అందజేస్తున్న దాత సంజీవ్ దంపతులు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మకు రూ.12 లక్షల విలువ చేసే వెండి మకర తోరణాన్ని బెంగళూరుకు చెందిన సంజీవ్ బహూకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు. బుధవారం 11 కిలోల బరువుతో తయారు చేసిన ఈ ఆభరణాన్ని ఆయన గురువారం ఆలయాధికారులకు అందజేశారన్నారు. దాత కుటుంబ సభ్యులకు చైర్మన్, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కోరిన కోర్కెలు ఫలించడంతో వెండి మకర తోరణం అందజేశామని పేర్కొన్నారు. అమ్మవారికి అలంకరించి, మొక్కులు చెల్లించారు. దాతకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

క్షేత్రస్థాయిలో పకడ్బందీగా విచారణ



మాట్లాడుతున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదైన దరఖాస్తుల విచారణ క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సాగుతోందని డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో విచారిస్తున్నట్లు చెప్పారు. జనవరి 12వ తేదీ వరకు విచారణ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు. ఓటర్ల తుది జాబితా జనవరి 22వ తేదీన ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలోని 1,762 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తీసివేతలకు ఎలాంటి అనుమానాలున్నా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు పరదేశి, గంగరాజు, లోకేష్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో సురక్ష



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ సునీల్‌కుమార్ నాయక్

చిత్తూరు రూరల్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సునీల్‌కుమార్ నాయక్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన బుధవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణ లోటుపాట్లను గుర్తించాలన్నారు. వాటిని సరిద్దిదేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. మండలంలో నాలుగు క్యాంపులు, వారంలో ఒక క్యాంపు చొప్పున నిర్వహించాలన్నారు. ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు ఎఫ్‌డీపీ డాక్టర్లు మొత్తం నలుగురు డాక్టర్లతో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని పకడ్బందీగా జరిపించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, డీపీఎంఓ హర్షవర్ధన్, అధికారులు జయసింహ, శిరీష, శ్రీనివాసులు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పడిమెట్ల పూజోత్సవం



విశేషాలంకరణలో పడిమెట్లు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో ఉన్న కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో పడిమెట్ల పూజోత్సవాన్ని బుధవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలోని పద్దెనిమది మెట్లను వివిధ రకాల పుష్పాలు, నేతి దీపాలు, ఫలాలు, చందన, కుంకుమతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ కేరళ సంప్రదాయ పద్ధతులతో ప్రతి మెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అయ్యప్పస్వాముల భజనలు భక్తులను అలరించాయి. పడిమెట్ల పూజోత్సవం తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పడిమెట్ల పూజ అనంతరం అయ్యప్పకు విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ప్రత్యేకాలంకారంలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అయ్యప్ప నామ స్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలతమ్మ, కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కవితమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ పోస్టుకు కానిస్టేబుల్ ఎంపిక



గాయత్రిని సన్మానిస్తున్న డీఎస్పీ సుధాకర్ రెడ్డి

రామకుప్పం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గాయత్రి ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యారు. వి.కోట మండలం దాసార్లపల్లెకు చెందిన గాయత్రి 2018లో రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఆమె ఎస్‌ఐ కావాలన్న తపనతో కష్టపడి చదివి, అక్టోబర్ నెలలో నిర్వహించిన ఎస్‌ఐ మెయిన్ పరీక్షలు రాసింది. తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐ పోస్టుకు ఎంపికైంది. దీంతో గాయత్రి, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పోస్టుకు ఎంపికైన గాయత్రిని పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ శివకుమార్ ఆమెకు శాలువ కప్పి, సన్మానించి అభినందించారు.

ట్యాబ్‌లిచ్చినా కడుపుమంటేనా?

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలలకొచ్చే పేద పిల్లలకు ట్యాబ్‌లిచ్చి, వారిలో విజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేస్తుంటే దానిపై కూడా కొందరికి కడుపుమంట తప్పడం లేదని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మండలంలోని కొలమాసనపల్లె ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో నాడు–నేడు పథకంలో రూ.43 లక్షలతో నిర్మించిన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాల్సిందేనన్నారు. అందులో భాగంగా ఉన్నత చదువులు, లేదా విదేశీ కంపెనీల్లో పనిచేయాలన్నా సాంకేతికంగా విద్యార్థులు ఇప్పటి నుంచే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకంలో బలోపేతం చేసి, పిల్లలకు డిజిటల్ విద్యతో పాటు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టి, ట్యాబ్‌లను అందిస్తోందన్నారు. దీనిపై కడుపుమండిన పచ్చమీడియా ఇదేదో పెద్ద తప్పుగా భావిస్తోందన్నారు. ఆదే వీరి పిల్లలకు మాత్రం స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లుండాలా?, పేద పిల్లలకుంటే తప్పా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలసుందరం, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, వైస్ ఎంపీపీ గజేంద్ర, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, సర్పంచ్ గోవిందస్వామి, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు మనోజ్‌రెడ్డి, వీరభద్ర పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లపట్టాలు

- జనవరి 6వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలి
- కమిటీ సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి



కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులందరికీ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జర్నలిస్టుల ఇళ్ల పట్టాల మంజూరుకు ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల పట్టాల మంజూరు కోసం జనవరి 6వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ 2023 సంవత్సరంలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రభుత్వం జీఓ 535 ను జారీచేసిందన్నారు. ఇళ్ల పట్టాల దరఖాస్తులను రాష్ట్ర పౌరసంబంధాల శాఖ కార్యాలయం అధికారులు ప్రాథమికంగా పరిశీలన చేశారన్నారు. ఆ పరిశీలనలో అక్రిడిటేషన్ కార్డు, కనీసం 5 సంవత్సరాలు జర్నలిస్టుగా పనిచేసిన అనుభవాన్ని పరిశీలించారని తెలిపారు. పరిశీలన చేసిన తర్వాత ఇప్పటి వరకు 195 మంది జర్నలిస్టుల ప్రాథమిక జాబితా జిల్లాకు పంపారని చెప్పారు. తదుపరి పరిశీలనను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను గుర్తించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. జనవరి 6 వ తేదీతో దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ముగుస్తుందని ఎవరైనా దరఖాస్తులు చేసుకోకపోతే త్వరితగతిన చేసుకోవాలన్నారు. అనంతరం ఇళ్ల స్థలాల గుర్తింపునకు సంబంధించిన పలు అంశాలను చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్ అధికారులతో చర్చించారు. ఈ కమిటీ సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, ఆర్డీఓ చిన్నయ్య, జిల్లా సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, డీపీఆర్వో పద్మజ, తహసీల్దార్లు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

చిత్తూరు అర్బన్: చీకటి వేళ ఇళ్లు, బ్యాంకుల్లో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పలమనేరు పోలీసులు పట్టుకున్నారు. రూ.30 లక్షల విలువైన 520 గ్రాముల బంగారు ఆభరణాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథి గృహంలో దొంగల ముఠాను ఎస్పీ రిశాంత్‌రెడ్డి సమక్షంలో అరెస్టు చూపించారు. అనంతరం ఆయన ఈ వివరాలను వెల్లడించారు. పలమనేరు, పుంగనూరు, కుప్పం సర్కిల్ పరిధిలో జరిగిన చోరీలకు సంబంధించి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో దొంగలను పట్టుకోవడానికి నాలుగు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఆ ముఠాల వివరాలపై ఆరా తీశామన్నారు. బుధవారం అందిన సమాచారం మేరకు పలమనేరు–గంగవరం బ్రిడ్జిపై అంతరాష్ట్ర దొంగలను పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ. 30 లక్షలు విలువ చేసే 520 గ్రాముల ఆభరణాలు, రూ. 5 లక్షలు విలువ చేసే కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు ఏపీతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి, చోరీలకు పాల్పడుతున్నారని, కేరళ రాష్ట్రానికి చెందిన రమేష్ వీళ్ల ముఠాకు నాయకుడిగా విచారణలో తేలిందన్నారు. కాగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన రమేష్ (51), తమిళనాడుకు చెందిన గోవిందరాజు (35), శ్రీనివాసులు (37), కర్ణాటకు చెందిన గవియప్ప (41), గణేష్ (38), అశ్వత్ నారాయణ (34)ను అరెస్టు చేశామన్నారు. వీరిపై పలు రాష్ట్రాల్లో పలు కేసులున్నాయన్నారు. అనంతరం కేసు ఛేదించిన అధికారులు, సిబ్బందికి నగదు రివార్డు, ప్రశాంసాపత్రం అందజేశారు.



ముఠాను అరెస్టు చూపుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

అగ్ని ప్రమాదంలో బాలికకు గాయాలు

శాంతిపురం: పెయింటింగ్ చేస్తున్న ఇంట్లో పెయింట్‌లో కలిపే థిన్నర్ అంటుకుని ఇంటి గోడలు కూలిపోవడంతో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని శిలామాకులరాయి గ్రామంలో వెంకటేష్ పదేళ్ల క్రితం నిర్మించుకున్న ఇంటికి మళ్లీ పెయింటింగ్ చేయిస్తున్నారు. బుధవారం పనులు చేసిన పెయింటర్లు చివరన థిన్నర్ ఉపయోగించి బ్రష్‌లను, తమపై పడిన పెయింట్ మరకలను ఇంట్లో ఒక మూలన కడుక్కున్నారు. రాత్రి కరెంటు పోవడంతో అదే ఇంట్లో ఉంటున్న వెంకటేష్ కుమార్తె హేమావతి(8) అగ్గిపుల్లతో దీపం వెలిగించి, పుల్లను ఇంటి మూలకు విసిరేసింది. దీంతో ఒక్కసారిగా పేలుడు శబ్దంతో థిన్నర్ అంటుకుంది. దీని దాటికి ఇంటి గోడలు ఒక వైపున పూర్తిగా కూలిపోగా హేమావతికి నిప్పు అంటుకుంది. తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న బాలికను స్థానికులు 108 సాయంతో కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. వైద్యులు సిఫార్సు మేరకు కుటుంబ సభ్యులు ఆమెను పీఈఎస్ ఆస్పత్రికి తీసుకుపోయారు.



పేలుడు దాటికి కూలిన ఇంటి గోడ(ఇన్‌సెట్)క్షతగాత్రురాలు

జగన్‌తోనే బీసీలకు గుర్తింపు



వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రమణ్యం

రామకుప్పం: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత రాష్ట్రంలో బీసీలకు సముచిత గుర్తింపు, పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని వీర్నమల గ్రామంలో జరిగిన వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక బీసీ జనాభా ఉన్న కుప్పం నియోజక వర్గం ఏర్పడిన తర్వాత బీసీ నాయకులే ఎమ్మెల్యేలుగా గెలిచారని గుర్తు చేశారు. కానీ రాష్ట్రంలో టీడీపీ ఏర్పడిన తర్వాత కుప్పం స్థానాన్ని బీసీలకు దూరం చేశారని చెప్పారు. దివంగత గోపీనాథ్, డా.చంద్రమౌళి లాంటి బీసీలు పోటీ చేసినా చంద్రబాబు మాయమాటలు నమ్మి బీసీ ఓటర్లే వాళ్లను ఓడించారన్నారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ కులాల మధ్య చీలిక ఏర్పడడంతో 30 ఏళ్ల నుంచి కుప్పంలో చంద్రబాబు గెలిచారన్నారు. కానీ బీసీ కులాల్లో చైతన్యం రావడంతో కుప్పం రాజకీయ చిత్రం మారిందని చెప్పారు. యువ నాయకుడు ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చరిత్ర సృష్టించిందన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ వన్నికుల క్షత్రియులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు రానున్న ఎన్నికల్లో భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవిని ఇస్తామని సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టి అబద్ధపు హామీలతో మళ్లీ ఓట్ల కోసం వచ్చే చంద్రబాబు బృందంతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రతి గడపకు వచ్చానని, ఒకసారి తనని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అంతేగాక బీసీలకు వచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకోవాలంటే ఈసారి ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా వన్నెకుల క్షత్రియుల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ భరత్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వన్నికుల క్షత్రియుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, నేతలు మురుగేష్, బుల్లెట్ దండపాణి, జెడ్పీటీసీ సభ్యులు శరవణ, నేతలు నరసింహులు, నారాయణప్ప, మునిస్వామి గౌండర్, పడవేటు, మునిరత్నం, శివనేష్, మునెమ్మ, గుణశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వీ బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి చంద్రబాబు కుప్పం పర్యటన

కుప్పంరూరల్: ప్రతిపక్ష నేత చంద్రబాబు గురువారం నుంచి మూడు రోజుల పాటు కుప్పంలో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు గుడుపల్లె సభతో ప్రారంభమయ్యే బాబు పర్యటన 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు సాగనుంది. చివరగా 30వ తేది మల్లానూరులో బహిరంగ సభ అనంతరం పచ్చూరు మీదుగా బెంగళూరు చేరుకుని హైదరాబాద్ తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ విమానాశ్రయం నుంచి బెంగళూరు చేరుకుంటారు. అక్కడ రెండు పార్టీ కార్యక్రమాల తరువాత రోడ్డు మార్గంలో సాయంత్రం 4 గంటలకు గుడుపల్లెకు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 6 గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం కుప్పం పట్టణంలోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. ముఖ్యనేతలతో ముఖాముఖి తరువాత 8.30 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చేరుకుంటారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి 12 గంటలకు శాంతిపురం బహిరంగ సభా స్థలానికి చేరుకుంటారు. సభ తరువాత 3 గంటలకు రామకుప్పం కూడలిలో, 4 గంటలకు అక్కడ సభ నిర్వహిస్తారు. తరువాత 5.15 గంటలకు కుప్పం ఎంఎం మహల్ చేరుకుని కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. తరువాత ఆర్ అండ్ బీ అతిథిగృహం చేరుకుంటారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కనకదాస విగ్రహావిష్కరణ చేస్తారు. 2.20 గంటలకు అన్నా క్యాంటీన్ సందర్శన, 3 గంటలకు పెద్దపల్లి గంగమ్మ దేవాలయంలో పూజల్లో పాల్గొంటారు. 4.30 గంటలకు మల్లానూరు చేరుకుని బహిరంగసభలో పాల్గొంటారు. సభ అనంతరం తమిళనాడు పచ్చూరు మీదుగా బెంగళూరు చేరుకుని హైదరాబాద్ తిరుగుప్రయాణం అవుతారు.

వికసిత్ భారత్ ప్రారంభించిన జెడ్పీ చైర్మన్

వి.కోట: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రను బుధవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభించారు. వి.కోట మండలంలోని కృష్ణాపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించడానికే వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్ ,శివ, పార్థసారథి, అంజి, సోమశేఖర్ పాల్గొన్నారు.



భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్

జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు

పుత్తూరు: విశాఖపట్నం రామకృష్ణ బీచ్ వేదికగా ఈనెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న జాతీయ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యువకిషోర్, విశాల్ ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఇటీవల అనకాపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచినందుకు గాను 52 కిలోల విభాగంలో యువకిషోర్, 57 కిలోల విభాగంలో విశాల్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం కరుణానవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



గ్రాప్లింగ్ క్రీడాకారులు యువకిషోర్, విశాల్‌తో పీడీ చంద్రశేఖర్‌రాజు

భవన పనులు త్వరగా పూర్తి చేయండి



పనులు పర్యవేక్షిస్తున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డీఆర్వో రాజశేఖర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న స్పందన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డీఆర్వో మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు పకడ్బందీగా చేపట్టేలా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆయా సచివాలయాల పరిధిలో ప్రతిరోజూ క్రీడాపోటీలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి నిర్ణయించిన మేరకు జట్లకు పోటీలు నిర్వహించాలన్నారు. పోటీలు ప్రారంభం కాగానే వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కొన్ని గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో ఆటలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. ప్రారంభం కాని గ్రామాల్లో వెంటనే క్రీడలను ప్రారంభించాలని తెలిపారు. లే అవుట్ డిజైన్ చేయాలన్నారు. ఏర్పాట్లు నిబంధనల మేరకు చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ తులసి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కాణిపాకానికి 'నూతన' ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్: నూతన సంవత్సరం జనవరి ఒకటో తేదీని పురస్కరించుకుని కాణిపాకం గ్రామానికి ఈనెల 31, జనవరి ఒకటో తేదీన ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, పీలేరు, చిత్తూరు నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నేతపై ఫోర్జరీ కేసు

ఐరాల: టీడీపీ ఐరాల మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబుపై కర్ణాటక పోలీసులు ఫోర్జరీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో గిరిధర్ బాబు భార్యాభర్తలిద్దరినీ అరెస్టు చేశారు. కర్ణాటక పోలీసుల కథనం మేరకు.. టీడీపీ ఐరాల మండల అధ్యక్షుడు బెంగళూరులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలో ఒక ఇంటిని ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. తొలుత ఒకరికి ఇంటిని విక్రయించి, రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఆ తరువాత అదే ఇంటిని మరొకరికి విక్రయించి, రిజిస్ట్రేషన్ చేసి, ఇచ్చారు. ఈ విషయం గుర్తించిన బాధితులు బెంగళూరులో పోలీసులను ఆశ్రయించారు. దీంతో కర్ణాటక పోలీసులు గిరిధర్‌బాబుపై ఫోర్జరీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కర్ణాటక పోలీసులు ఐరాలకు చేరుకున్నారు. స్థానిక పోలీసుల సాయంతో మండల కేంద్రమైన ఐరాలలోని గిరిధర్‌బాబుతోపాటు ఆయన భార్యను అతడి ఇంట్లోనే అదుపులోకి తీసుకుని, కర్ణాటకకు తీసుకెళ్లారు. ఇదంతా చూసిన గ్రామస్తులు.. గిరిధర్‌బాబు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం డీకేటీ భూములు ఆక్రమణలతోపాటు నీరు–చెట్టు తదితర పథకాల నిధులు స్వాహా చేయడమే కాకుండా కర్ణాటకలో కూడా అక్రమాలకు పాల్పడ్డారా? అని ముక్కున వేలు వేసుకున్నారు.

మద్యం కేసులో ఒకరి అరెస్టు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం సీజ్ చేసి, ఒకరిని అరెస్టు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ పోలీసులు బుధవారం యాదమరిలో దాడులు చేశారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న పి.నరేష్ (43)ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 30 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ట్రైనీ ఏఎస్‌ఐ శ్రీరాం, ఎస్‌ఐ మోహన్ బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, వెంకటేశు, మమత, మోహన్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

నాటు సారా కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ అధికారులు తెలిపారు. ఎస్‌ఈబీ పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. గ్రామంలో ఓ ప్రాంతంలో దాచి ఉంచిన 10 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే కుమార్ (25) అనే వ్యక్తి సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు, సిబ్బంది బాబు, శంకర్ నాయక్, వెంకటేశ్వర్లు, సురేంద్ర, శైలజ తదితరులుపాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి



జయచంద్రఆచారి(ఫైల్)

పూతలపట్టు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంభూపాల్ కథనం మేరకు.. పెనుమూరు మండలంలోని మొరవకండ్రిగకు చెందిన జయచంద్ర ఆచారి(41) మంగళవారం వ్యక్తిగత పనులు నిమిత్తం పాకాలకు వెళ్లారు. పనులు పూర్తి అయిన తరువాత రాత్రి పాకాల నుంచి బస్సులో వచ్చి పూతలపట్టు మండలం పి.కొత్తకోట బ్రిడ్జి వద్ద దిగాడు. అనంతరం ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు నుంచి చిత్తూరుకు వస్తున్న తవణంపల్లె కొండ్రాజుకాల్వకు చెందిన మోటారుసైకిలిస్టు చంటి అతి వేగంగా వచ్చి, జయచంద్ర ఆచారిని ఢీ కొన్నాడు. దీంతో జయచంద్ర ఆచారి కింద పడి తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుని కుటుంబానికి సమాచారం అందజేశారు. సమాచారం తెలుసుకున్న బంధువులు బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకుని, ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

